**కథానిక**

# పూజాఫలం

కె. ఆర్. కె. మోహన్

ఆ రోజు శ్రావణ శుక్రవారం— వరలక్ష్మీపూజ. కమల రాత్రి మూడుగంటలకే నిద్రలేచింది. బాయిలర్ అంటించుకొని వేడినీళ్ళు కాచుకుని తలంటుకుంది. ఆ తర్వాత మడిబట్టలుకట్టుకొని, అమ్మవారి బొమ్మచేయడంకోసం, గుండ్రంగా ఉన్న పెద్ద కొబ్బరికాయ తీసుకుని వచ్చింది. దానిమీద పీచుతీసి, పైన శిఖ మాత్రం ఉంచి, చాకుతో మిగిలిన భాగమంతా నునుపు చేసింది. దానికి పసుపు రాసింది. గోధుమ పిండిని ఆముదంతో కలిపి ముక్కు, చెవులు చేసింది. బియ్యపు పిండిని అద్ది కనుగ్రుడ్లుచేసింది. వాటిపైన కాటుక అద్ది కనుపాపలు, కనుబొమలు దిద్దింది. పారాణిచేసి, దాంతో అమ్మవారికి నోరూ, బొట్టూ పెట్టింది. తన దిద్దులుతీసి చెవులకి తగిలించింది. ముక్కుపుడకని తీసి ముక్కుకిగుచ్చింది. సవరం తీసుకువచ్చి, కాయపైనున్న శిఖకి తగిలించి జడవేసి, అందులో మల్లెపూల దండ పెట్టింది. బిందెకి చీరకట్టి, దానిమీద మరచెంబు పెట్టింది. మరచెంబుకి రవికల గుడ్డ కట్టి దానిపైన ఆ అమ్మవారి బొమ్మ కొబ్బరికాయని పెట్టింది. ఇదంతా అయ్యేసరికి గంటన్నరపట్టింది. నడుములాక్కుపోసాగింది. అయితేనేం ఎంతో అందంగా అమ్మవారి విగ్రహం తయారయింది. అందుకు ఎంతో తృప్తిగా ఉంది. తాను సృష్టించిన బొమ్మని చూసి, తానే మురిసిపోసాగింది. పీటకి పసుపు రాసి, దాని మీద తమలపాకులు ఉంచి, బిందెతోసహా అమ్మవారి బొమ్మని ప్రతిష్ఠించింది. ఆ బొమ్మ ఎంతో అందంగా ప్రసన్న వదనంతో తయారయింది. యథాలాపంగా చూస్తే ఎవరో అందమైన పిల్ల పీటమీద కూర్చున్నట్లే ఉంది. ఇంతటి ప్రసన్న వదనంతో చేసిన అమ్మవారు, తన కోర్కెలు తీర్చకుండా ఎల్లా ఉంటుంది? అని మనస్సులోనే అనుకోసాగింది.

ఈ పని అయింతర్వాత, వంటపనిలోకి వెళ్ళింది కమల. గాస్‌స్టవ్‌మీద ఒకదానిమీద ఎసట్లో బియ్యం పోసి, ఇంకోదానిమీద పప్పు పడేసింది. అవి ఉడుకుతుండగా రోట్లో పప్పు పోసి రుబ్బటం మొదలుపెట్టింది. మామూలప్పుడే వంట అంటే నాట్యావధానమే. ఇంక పండగరోజంటే చెప్పేదిఏముంది? అందులోవరలక్ష్మీవ్రతంనాడు! తొమ్మిది గంటలకల్లా భర్తని ఆఫీసుకి పంపించాలి. పిల్లల్ని స్కూళ్ళకి పంపించాలి. అందుకే ఈ హడావుడి. అప్పటికి 6-30 అయింది. రేడియోలో భక్తిరంజని వినిపిస్తోంది. ఆ శబ్దాన్ని మింగేసేట్టుగా పెద్ద గొంతుతో లక్ష్మీ స్తోత్రం చదువుతూ, పిండి రుబ్బుతోంది కమల. ఇంతలో కూతురు జలజ వచ్చి "అమ్మా, అమ్మా ఎదురింటి మీనాక్షమ్మగారు వచ్చారే" అంటూ చెప్పింది. పిండి రుబ్బటం ఆపి, పిండి చెయ్యి కడుక్కుని, ఆ చేతిని

చెంగుకి తుడుచుకుంటూ బయటకు వచ్చింది కమల.

"వదినగారూ, పాపం, పనిలో ఉన్నారో ఏమో.... ఇవాళ లక్ష్మీ పూజ కదా. మీదొడ్లో కాసిని మామిడిమండలు కొంచెం పూలూ ఇస్తారా? మీ చేయి వీలు లేకపోతే మీ పిల్లని కోసి ఇమ్మనండి. లేదు....నన్నే కోసుకోమన్నా కోసుకుంటాను" అంది కమలతో మీనాక్షమ్మగారు.

కమలకి వళ్ళు మండింది. ఏమిటీ పనిలో ఉంటే ప్రొద్దున్నే వచ్చి యీ అడగడం?. అనుకొంది మనస్సులో పైకిమాత్రం "దానిదేముంది వదిన గారూ.... కాకపోతే ఇవాళ శుక్రవారం కదా. చూస్తూ చూస్తూ శుక్రవారపు ప్రొద్దున పచ్చని చెట్టు ఆకులూ, పువ్వులూ ఎల్లా కోస్తాను చెప్పండి. అందుకే పూలు నిన్ననే కోసి ఉంచాను. మామిడి ఆకులు కోయడం మర్చిపోతే మా దొడ్లోవి కోయకుండా, పిల్లని పంపించి, వెనకతోటలో తెప్పించా.మీరూ అక్కడ తీసుకోండి" అంది కమల.

మీనాక్షమ్మగారు చిన్నబుచ్చుకొని తోటవైపు వెళ్ళిపోయింది.

అప్పుడే నిద్రలేచిన కమల భర్త ఇదంతా గమనిస్తూనే ఉన్నాడు. కమల లోపలికి వస్తుంటే "ఆవిడ అడిగింది భాగ్యమా బంగారమా? ఆకులూ పువ్వు లేగా? ఇయ్యలేకపోయావా?" అన్నాడు.

సర్లెండి, ఇంకా పనిమనిషి రానేలేదు. పాచైనా కాలేదు. ప్రొద్దున్నే వచ్చి అడిగితే ఆకులు, పూలు అయితే మాత్రం ఎవరిస్తారు?" అంది కమల.

"ఇస్తే ఏమిపోయింది. మన పూలూ, ఆకులే వాళ్ళింట్లో అమ్మవారిని అలంకరించేవి. వాటికి ఆ యోగ్యత లేకుండా చేశావు" అన్నాడు ఆమె భర్త.

"సర్లెండి. మీకేం.... మగవారు. ఎన్నైనా చెప్తారు. ఓ పూజాలేదు, పునస్కారంలేదు. వారంలేదు-వర్జ్యం లేదు. తిథీలేదు-నక్షత్రం. ఆకులు, పూలుఅంటే మహాలక్ష్మితో సమానం.శుక్రవారప్పూట మన మహాలక్ష్మిని ఇంకొకళ్ళ కిస్తారు ఏమిటి?" అంది కమల.

"నువ్వు ఎన్నైనా చెప్పు. ఇంటికి వచ్చిన ఆవిడని ఆ విధంగా చిన్నబుచ్చి పంపడంనాకేమీనచ్చలేదు"అంటూ ముఖం కడుక్కోడానికి వెళ్ళాడు ఆమె భర్త.

మీనాక్షమ్మగారు ఎక్కడికి వెళ్ళిందో చూద్దామని డాబా ఎక్కింది కమల.ఆవిడ వెనకతోటలోకేవెళ్ళింది. అప్పుడుకావలా ఉన్న తాత ఆమెకి మామిడి ఆకులుకోసి ఇచ్చాడు. అవి అవగానే ఇంకేవో పూలు కూడా కోసి ఇస్తున్నాడు.

ఆమె తనని చూస్తుందేమోనని తల వంచుకుని మెట్లు దిగసాగింది, శుక్రవారం ప్రొద్దున్నే మామిడిమండలు తోటనించి తెప్పించానని అబద్ధమాడింది. తోటలో తాత ఉంటాడనీ, అతను ఆకులూ, పూలు ఇస్తాడనీ ఆమె అనుకోలేదు, తానుచేయలేని పని ఆ తాత చేశాడు. తాను చేసిన పని తప్పనీ, పండగనాడు అనవసరంగా అబద్ధం ఆడి పాపం మూటకట్టుకుందనీ. మనస్సు ఎత్తి పొడుస్తుంది కమలకి.

## 2

వరలక్ష్మి పూజ సవ్యంగా జరిగిపోయింది. భర్తా పిల్లలూ వెళ్ళాక, తాను కూడా భోజనంచేసి కాసేపు నడుంవాల్చుకుంది కమల. క్రితంరాత్రి మూడు గం

టలు కాకుండానే లేచిందేమో. ఆపైన అలసటతోనూ, భుక్తాయాసం తోనూ ఒళ్ళు బరువుగా ఉందేమో. వెంటనే కళ్ళు మూతలుపడి. బాగా నిద్రపట్టేసింది కమలకి.

## 3

అది యమధర్మరాజు సభ. చిత్రగుప్తుడు ఒక ప్రక్కన కూర్చుని పెద్ద పుస్తకంలో ఏవోచిట్టాలు చూస్తున్నాడు. యమధర్మరాజు బంగారు సింహాసనంమీద కూర్చుని ధగద్ధగాయ మానంగా మెరిసిపోతున్నాడు. అతనికి మరొక ప్రక్కన ఒక పెద్ద కుర్చీమీద, ఎవరో ముసలి మనిషి. బంగారు కిరీటం పెట్టుకుని కూర్చున్నాడు.

కమలని యమదూతలు లాక్కొనివచ్చి యమధర్మరాజు ముందు నిలబెట్టారు.

యముని విచారణ ప్రారంభమైంది.

"చిత్రగుప్తా.... ఈమె ఎవరు? ఈమె చేసినపాపమేమి!" అనిఅడిగాడుయముడు.

చిత్రగుప్తుడు చిట్టాలు పేజీలు త్రిప్పాడు.

"దేవా ఈమెపేరు కమల భూలోకవాసిని. వరలక్ష్మీవ్రతం వంటి ముఖ్యమైన రోజున, ఎదురింటి ఆమె వచ్చి, కేవలం మామిడి ఆకులు, పాలు అడిగితే తన పుణ్యం ఇతరులకి పోతుందేమోననే స్వార్థ చింతనతో, ఈమె ఇవ్వకుండా, పంపించింది. ఈమె స్వార్థానికి తగిన శిక్ష వెయ్యాలి మహాప్రభు" అన్నాడు చిత్రగుప్తుడు.

"ఇందుకు నీ సంజాయిషీ ఏమిటి?" అని యముడు గర్జించి అడిగాడుకమలని.

కమల ఏమి చెప్పలేదు. తలవంచుకుని నిలబడింది.

"ఆమె ఏమి సంజాయిషీ చెప్తుంది ప్రభూ. పైగా పండగపూట దొడ్లోనే కోసిన మామిడి ఆకులను, తోటనించి తెప్పించానని మీనాక్షమ్మగారితో అబద్ధమాడింది." అన్నాడుమళ్ళీ చిత్రగుప్తుడు. ఆ ఇద్దరి మాటలకీ కమల భయపడిపోయింది. ఏమీ మాట్లాడలేదు.

"సరే. ఈ ఆసనంమీద ఉన్నకొత్త వ్యక్తి ఎవరు?" అనిఅడిగాడు యముడు. ఆ ముసలివ్యక్తిని చూపించి.

"ఇతను కమలమ్మ ఇంటి వెనక తోటలో ఉండే తాత. మీనాక్షమ్మగారు మామిడి మండలు అడగగానే అంతకన్నానా అమ్మా. నేను పూజచేయలేకపోయినా. నేనిచ్చే ఆకులతో మీరు పూజ చేస్తానంటే. అంతకంటె కావలసింది ఏమిటమ్మా. కొన్ని పూలుకూడాఇస్తాను. తీసుకెళ్ళండి. అంటూ ఆకులూ. పూలు కూడా కోసి ఇచ్చాడు. చదువురానివాడైనా అమాయకుడైనా ఎంతో సంస్కారం చూపించాడు." అన్నాడు చిత్రగుప్తుడు.

"అందుకేనా.... కిరీటంపెట్టి, ఆసనం మీద కూర్చోపెటారు. శహభాష్.. ఇతన్ని స్వర్గలోకానికి పంపించండి. ఈ కమలమ్మకి అబద్ధం చెప్పినందుకుమూడు వాతలు వేయండి!" అన్నాడు యముడు.

యమభటులు చురచుర కాలుతున్న ఇనపకడ్డీని, వాతలు వేయడానికి కమల దగ్గరకితెచ్చారు. "వద్దు....వద్దు" అంటూ కెవ్వున కేకవేసింది.

కేకతోపాటు ధన్నుమని కిందకి పడింది. కళ్ళుతెరిచి చూస్తే అంతాకల. "ఈ పీడకల ఎంత కలవరపెట్టింది! నా మనస్సే నరకంఅయి. కలలో నాతప్పుని చూపింది." అనుకుంది కమల ●

అనామిక